క్లుప్తంగా

### 19న ముండ్రువారిపాలెం ఉపసర్పంచ్ ఎన్నిక

**శావల్యాపురం:** మండలంలోని ముండ్రువారి పాలెం గ్రామ పంచాయతీ ఉపసర్పంచి ఎన్నిక ఈనెల 19న ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. గతంలో విధులు నిర్వహించుతున్న ఉప సర్పంచ్ పాపసాని విజయ లక్ష్మి ఏప్రిల్10న తన పదవికు రాజీనామా చేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడగా వార్డు సభ్యులు 10 మంది ఉండగా వారిలో నుంచి ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకుంటారన్నారు. ఎన్నికల అధికారి ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పర్యవేక్షణలో ఎన్నిక జరుగుతుందన్నారు. వార్డు సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి నోటీసులు పంచాయతీ కార్యదర్శి జి.వాసు అందజేసినట్లు తెలిపారు.

### ఘనంగా నాగేంద్రస్వామి జన్మదిన వేడుకలు

**శావల్యాపురం:** మండలంలోని పోట్లూరు గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద వేంచేసియున్న శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో నాగేంద్ర స్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదాలు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

### మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



**బొల్లాపల్లి :** ప్రొహిబిషన్ /ఎక్సైజ్ ఈపూరు స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని, అవి సక్రమంగా పని చేసేలా చూడాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మద్యం దుకాణాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటి పనితీరుపై పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని తెలిపారు.

### 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులు ఉండాలి

**నాదెండ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో క్లాస్ వైజ్, సబ్జెక్ట్ వైజ్, సెక్షన్ వైజ్ 1:20 నిష్పత్తిలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. నాదెండ్లలో ఆయన మాట్లాడుతూ, మోడల్ ప్రైమరీ స్కూలులో పైవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఆ గ్రామానికి ప్రైవేటు బస్సు వచ్చే అవకాశమే లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. గ్రామ జనాభాను బట్టి 200-500 మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి గ్రామానికి ఒక మోడల్ ప్రైమరీ స్కూలు, ఒక ఉన్నత పాఠశాల సరిపోతాయన్నారు. చిన్న గ్రామాలైతే రెండు, మూడు గ్రామాలకు కలిపి ఒక ఉన్నత పాఠశాల సరిపోతుందన్నారు. తమ ఇంటి పక్కనే పాఠశాల ఉండాలని తల్లిదండ్రులు, తమ స్వగ్రామం, స్వంత మండలంలోనే ఉద్యోగం చేయాలనే ఆలోచనలకు ఉపాధ్యాయులు స్వస్తి పలకాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉండటం వలన విద్యా వ్యవస్థ సుస్థిరంగా ఉంటుందన్నారు.

### రెండు నివాసాల్లో చోరీ

**యడ్లపాడు:** మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఎవరూ లేని రెండు ఇండ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డ్రైవర్ నరవారి హనుమాసింగ్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. సింగ్ డ్రైవర్‌గా తన విధులు ముగించుకుని శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి రాగా, ప్రధాన తలుపుకు వేసి తాళాలు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా గదుల్లో వస్తువులన్నీ అస్తవ్యస్తంగా ఉండటంతో చోరీ జరిగినట్టు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని దుండగులు గురు వారం అర్ధరాత్రి ఇంట్లోకి దూరి బీరువాలోని రూ.20 వేల నగదు, 50 తులాల వెండి, 9 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు.

**మరో ఇంట్లో చోరీ యత్నం**

సింగ్ ఇంటి ఎదురుగా ఉన్న దండా ప్రమీల నివాసంలోనూ చోరీయత్నం జరిగింది. సదరు కుటుంబం కూడా స్థానికంగా లేకపోవడంతో తలుపు తాళాలు పగులగొట్టి అంతటా వెతికి విలువైన వస్తువులేమీ కనిపించక పోవడంతో వెళ్లారు. ఇదే విషయాన్ని ప్రమీలకు స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలాలకు వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం పిలిపించి ఆధారాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు. అయితే దుండగులు ప్రొఫెషనల్ దొంగలు అయి ఉంటారని ఘటనా స్థలాల్ని పరిశీలించిన పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడిస్తున్నారు.

# శిథిలావస్థలో వెన్నముద్ద కన్నయ్య ఆలయం

- పీఠం కూలేందుకు సిద్ధంగా ధ్వజస్తంభం
- వర్షం కురిస్తే ఆలయం జలమయం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వెన్నముద్దల బాలకృష్ణుడికి పునర్వైభవం ఎప్పటికీ దక్కేనో!

**యడ్లపాడు:** ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన గొప్ప దేవస్థానం అది. ప్రపంచంలోనే ఎక్కడా కానరాని విశిష్టత కలిగిన విగ్రహం అందులో కొలువై ఉంది. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామంలో వెన్నముద్దల బాలకృష్ణుడిగా ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి ఆలయమది. శ్రీకృష్ణ దేవరాయల కాలంనాటి ఈ ఆలయంలో ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరింది. అప్పట్లో వందలాది మాన్యం భూములు కలిగి నిత్యం ధూపదీప నైవేద్యాలతో వెలుగొందిన ఈ నల్లనయ్య కొవెల ఆధ్యాత్మికంగా దేవదాయశాఖలోనూ, చారిత్రకపరంగా పురావస్తుశాఖ పరిధిలో ఉన్నప్పటీ శతాబ్దాల కాలంగా మరమ్మతులు తప్పా పూర్తి అభివృద్ధి అన్నది ఎంతకూ జరగడం లేదు. టీడీపీ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపిణీపై చూపుతున్న శ్రద్ధ ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయంలోకి వర్షపు నీరు చేరుతుండటంతో ప్రధాన ద్వారం వద్ద తాత్కాలికంగా అడ్డుకట్టను నిర్మించారు.



వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయం ముఖద్వారం

**కోవెల్లో కొలువుదీరిందిలా...**

శ్రీకృష్ణదేవరాయలు జైత్రయాత్రకు గుర్తుగా కోట గ్రామంలో 67 అడుగుల ఏకరాతి విజయస్తూపం. దీనికి ఎదురుగా ఆలయాన్ని నిర్మించి గోపీనాథ స్వామిని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత బహమ్మనీ సుల్తానుల దాడుల మొదలవ్వడంతో ఈ స్వామి విగ్రహాన్ని నాటి బ్రాహ్మణులు భూస్థాపితం చేశారు. బ్రిటీష్ పాలన సమయంలో పంటపొలాల్లో ఈ విగ్రహం బయల్పడింది. వేగుల ద్వారా సమాచారం అందుకున్న అప్పటి చిలకలూరిపేట జమీందార్‌గా వ్యవహరిస్తున్న మానూరు వెంకటకృష్ణరాయణం అక్కడికి వెళ్లి ముగ్ధమనోహరమైన చిన్ని కృష్ణుని విగ్రహాన్ని చూసి అచ్చెరువొందారు. తమ కోట సమీపాన దానిని ప్రతిష్ఠించాలని సంకల్పించుకుని ఎడ్లబండిపై తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో బండి ఇరుసు విరిగిపోయింది. మరమ్మత్తు చేయాలని మంత్రిని ఆదేశించి సమీపంలోని ఓ చెట్టు కింద రాజావారు విశ్రమించారు. అప్పుడు తన స్వప్నంలో దర్శనమిచ్చిన నల్లనయ్య కోరిక మేరకు రాజు తన నిర్ణయాన్ని మార్చుకుని అదే గ్రామంలోని వేణుగోపాలస్వామి గుడిలో వెన్నముద్దల బాలకృష్ణుని ప్రతిష్ఠింపజేశారు. ఆలయ నిర్వహణకు సుమారు 571 ఎకరాల మాన్యాన్ని సైతం రాజామానూరు కానుక ఇవ్వడం జరిగింది. నాటి నుంచి ఈ ఆలయం వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయంగానే గొప్ప ప్రసిద్ధి చెందింది.

**నెరవేరని స్వర్ణమందిరం స్వప్నం**

కొద్దికాలం కిందట కృష్ణచైతన్య సంఘం(ఇస్కాన్) ఈ దేవాలయాన్ని స్వర్ణమందిరంగా మారుస్తామంటూ ఈ ప్రాంతంలో కొంత భూములు తీసుకున్నప్పటికీ వివిధ కారణాలతో అదీ కార్యచరణకు నోచుకోలేదు. చెంఘీజ్‌ఖాన్‌పేట -సంక్రాంతిపాడు మధ్య ఈ స్వర్ణమందిరం పనుల్ని ఇస్కాన్ చేపట్టింది. రాజస్థాన్ రాతితో కొన్ని మందిరాల నిర్మాణాలను చేపట్టారు. నోట్ల రద్దు, కరోనా సమయాల్లో చేపట్టిన ఈ కట్టడాలు ఆర్థిక విపత్తులతో దాతలు ముందుకు రాకపోవడంతో అవి మధ్యలోనే నిలిచిపోయాయి. ఇలా నల్లనయ్య ఆలయ అభివృద్ధికి ఎన్నో అవరోధాలు ఏర్పడ్డాయి.



చేతికందే ఎత్తులో గర్భగుడి పైకప్పు కింద పూజలందుకుంటున్న నల్లనయ్య



రోడ్డుకంటే బాగా దిగువగా ఉన్న ఆలయం

### కన్నయ్యకు భక్తులకు కష్టాలివీ!

రాజుల కాలంలో రాతిగోడలతో నిర్మించిన మండపంలోనే నేటికీ నల్లనయ్య పూజలు అందుకుంటున్నాడు. గుడి ఎత్తు తక్కువగా ఉండటం, గ్రామంలోని అంతర్గత రోడ్లకు, గృహాలకు దిగువుగా లోతట్టున ఉన్నందున వర్షం కురిస్తే ఆలయం అంతా నీళ్లు నిలబడి భక్తుల దర్శనానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఆ వర్షపు నీరు బయటకు పోయే మార్గం కూడాలేదు. ఎన్నో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా తట్టుకుని నిలబడిన రాజా మానూరురాయణం కాలంలో ప్రతిష్ఠించిన ఆలయ ధ్వజస్తంభంపై ఉన్న పీఠం శిథిలమై ప్రస్తుతం దక్షిణం వైపు కొద్దిగా ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. అన్నింటికీ మించి ఏళ్ల తరబడి ఆలయ ధ్వజస్తంభం శిథిలావస్థలో ఉంటే అది ఆ ఊరికే అరిష్టమనే భావన గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఎత్తును కూడా పెంచి, కొత్త ఆలయాన్ని నిర్మించాల్సి ఉంది. పాలకులు, సంబంధిత శాఖల అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ఖండాంతర ఖ్యాతి కలిగిన వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయానికి అభివృద్ధికి చర్యలు తీసుకుని పూర్వవైభవాన్ని తీసుకురావాలని, గాలులకు ఊగిసలాడి పూర్తిగా కిందపడిపోకముందే కనీసం శిథిలమైన ధ్వజస్తంభాన్ని మార్చాలని నల్లనయ్య భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.



గతంలో వర్షానికి జలమయమైన ఆలయం (ఫైల్)

### సీహెచ్‌ఓల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

కోరిన ఏఐటీయూసీ నాయకులు



శిబిరంలో సీహెచ్‌ఓలకు సంఘీభావం తెలిపిన ఏఐటీయూసీ నాయకులు

**నరసరావుపేట:** జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ)ల సమస్యల పరిష్కారానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృషి చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. తమ ఉద్యోగాల భద్రతతో పాటు పలు సమస్యల పరిష్కారానికి స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కు వద్ద 19 రోజులుగా సీహెచ్‌ఓలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత ఏడేళ్లుగా ఆయా పంచాయతీ పరిధిలో ఆరోగ్య సేవలను అందిస్తున్న సీహెచ్‌ఓల ఆర్థిక, అర్థికేతర సమస్యల పరిష్కారం, రావలసిన బెనిఫిట్స్ కోసం చేపట్టిన దీక్షలు 19వ రోజుకు చేరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. ఏపీఎంసీఏ అసోసియేషన్ జిల్లా నాయకులు అనుపమ, సాగర్, రాము మాట్లాడుతూ ఆరేళ్లు పూర్తిచేసుకున్న ప్రతి సీహెచ్‌ఓను రెగ్యులర్ చేయాలని, 23% ఇంక్రిమెంట్, జాబ్ చార్ట్ అమలు చేయడం, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని అన్నారు. జిల్లా నాయకులు రాము, మస్తాన్, శివ, కోటి, కమల, గాంధీ స్మారక సమితి వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్, ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, చక్రవాకం సత్యనారాయణరాజు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

# సొసైటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు

- ఎనిమిది కార్యక్రమాలను రూపొందించిన జిల్లా అధికారులు
- కనీసం నాలుగు కార్యక్రమాలైన చేపట్టాలి
- ఉత్తమ కార్యక్రమాలకు గుర్తింపు

**రొంపిచర్ల:** ప్రతినెలా మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో గ్రామాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు జిల్లా సహకార శాఖ అధికారి ఎం. వెంకట రమణ జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 పీఏసీఎస్‌ల్లో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహణకు నడుం బిగించారు. ఈనెల మూడవ శనివారం నిర్వహించాల్సిన 8 అంశాలపై కార్యక్రమాలను నిర్వహించాలని సొసైటీలకు సూచించారు. ఇందులో మొదటిది సౌర పరావర్తన శ్వేత రంగును ప్రోత్సహించటం కోసం కార్యాలయాల భవనాలపై వేయించి సూర్యకాంతిని ప్రతిభించటం ద్వారా కార్యాలయాల్లో వేడి తగ్గటంతో పాటు పవర్ వినియోగం కూడా తగ్గించటం. రెండు చలివేంద్రాల ఏర్పాటు, వేడి ఎక్కువగా ఉన్న మే నెలలో ప్రజలకు సాగు నీటి లభ్యతను కల్పించటం, మూడు వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను చేపట్టటం, సంఘ కార్యాలయాలు, గోదాములు ఆవరణలో ఇంకుడు గుంటల ఏర్పాటు చేసి నీటి సంరక్షణ. నాలుగు బలహీన వర్గాల కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు, వృద్ధులు, పిల్లలు, కార్మికులకు ఫస్ట్ ఎయిడ్, వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించటం. ఐదు పక్షులు, జంతువుల కోసం మట్టిపాత్రల్లో నీటిని నింపి, కార్యాలయాలు, గోదాములు, పార్క్‌లపై ఏర్పాటు చేయటం ద్వారా వేసవిలో పక్షులకు, జంతువులకు నీటిని అందించటం. ఆరు పునరుత్పాదక కేంద్రం, వ్యర్థనిర్వహణ, వాతావరణ మార్పులపై అవగాహన కార్యక్రమాలతో వాతావరణానికి అనుకూలమైన విద్యను విస్తరింపచేయడం. 7 సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ల నిషేధం, రీయూజబుల్ బాటిల్స్‌ను ప్రోత్సహించటం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించటం, స్థిరమైన వినియోగాన్ని ప్రోత్సహించటం. 8 బీట్ ద హీట్ అంశంపై వ్యాసరచన నిర్వహించటం, పిల్లల్లో, పెద్దల్లో వాతావరణం, వేసవిలో వేడి తదితర అంశాలపై అవగాహన కల్పించటం లాంటి కార్యక్రమాలను చేపట్టాలని కార్యక్రమాలను రూపొందించారు. సూచించిన 8 కార్యక్రమాల్లో ఆయా సొసైటీల పరిధిలో నిర్వహించ దగ్గ కార్యక్రమాలు కనీసం 3 లేదా 4 కార్యక్రమాలైన నిర్వహించాలని ఆదేశించారు.



సొసైటీ భవనం

### మంచి కార్యక్రమాలకు ప్రోత్సాహకం



పల్నాడు జిల్లాలో ఉన్న 60 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మూడవ శనివారం సందర్భంగా ఎస్ఏ ఎస్ఏ కార్యక్రమాల నిర్వహణ తప్పనిసరి అన్నారు. ప్రతి సొసైటీల్లో నిర్దేశించిన ఎనిమిది కార్యక్రమాల్లో కనీసం 3 లేదా 4 కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 60 సొసైటీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఉత్తమ కార్యక్రమాలను ఎంపిక చేసి ఆ సంఘాలకు ప్రత్యేక బహుమతులు కూడా అందజేయడానికి ఏర్పాటు చేశామన్నారు.

– ఎం. వెంకట రమణ, జిల్లా సహకార శాఖ అధికారి

### చకచకా కేంద్రియ విద్యాలయం రహదారి పనులు



**నాదెండ్ల:** మండలంలోని ఇర్లపాడు కేంద్రియ విద్యాలయం నుంచి నరసరావుపేట రహదారి వరకూ నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.40 లక్షల వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. సెంటర్ డివైడర్‌తో రెండు పక్కల 20 అడుగుల వెడల్పు మేర సుమారు 90 మీటర్ల పొడవున రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో నిర్మాణ పనులు ప్రారంభం కాగా, జూన్ నాటికి రోడ్డు నిర్మాణం పూర్తికానుంది. ఈ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు సౌకర్యవంతంగా వాహన రాకపోకలకు సమస్యలు తొలగిపోనున్నాయి. ఇప్పటికే నరసరావుపేట రోడ్డుపై కేంద్రియ విద్యాలయం సమీపంలో జీబ్రా లైన్లు ఏర్పాటు చేయటంతో ప్రమాదాలు తగ్గాయి. అంతేకాక ఉపాధి హామీ పథకం నిధులతో నరసరావుపేట రోడ్డు నుంచి కేంద్రియ విద్యాలయం పడమర వైపు నుంచి కనపర్రు మీదుగా గుంటూరు రోడ్డులో రూ.28 లక్షల వ్యయంతో మెటల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి.

# రక్తహీనతపై జాగ్రత్త అవసరం

సూపర్‌వైజర్ ఎం జోజమ్మ

**యడ్లపాడు:** కౌమర దశకు చేరుకున్న బాలికల ఆరోగ్య సమస్యలు, ఇతర వడిదుడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళా శిశుసంక్షేమ శాఖ వేసవి సెలవులలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలో రక్తహీనతపై సదస్సు నిర్వహించారు. స్థానికంగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ ఎం .జోజమ్మ పాల్గొని మాట్లాడుతూ బాలికల్లో రక్తహీతన వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్య రక్షణకు ప్రధానమైనది వ్యక్తిగత పరిశుభ్రత అన్నారు. భోజనానికి ముందు, బహిర్భూమికి తర్వాత తప్పకుండా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అలాగే రక్తహీనత నివాణకు ఆకుకూరలు ఎంతో మేలు చేస్తాయన్నారు. అయితే కూరగాయలు తరిగే సమయంలోనూ చేతుల్ని శుభ్రం చేసుకునే వంటకు ఉపక్రమించాలన్నారు. వీటితో పాటు వివిధ రకాల పండ్లను కూడా స్వీకరించాలని తెలిపారు. నేటి కిశోరబాలికలే రేపటి ఉత్తమ సమాజానికి ఆరోగ్యవంతమైన తల్లి అని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.నళిని, ఎస్.సువర్చల, షేక్ కరీమూన్, పి.నీలేశ్వరీ ఉన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

**డెంగ్యూ నివారణ దినోత్సవ కార్యక్రమం**

**శావల్యాపురం:** జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రావిపూడి రమ్య పాల్గొని మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి దోమకాటు వలన వస్తుందన్నారు. జ్వరం తలనొప్పి కాళ్ల నొప్పిలు ప్లేటిలెట్స్ పడిపోవటం శరీరంలో ఏభాగం నుంచి అయిన రక్తస్రవం జరగటం తదితర లక్షణాలు కల్గియున్న వారందరూ నిర్లక్షం వహిస్తే ప్రాణాలు కోల్పోవుతారన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మురుగుకాల్వలో దోమల లార్వీల నివారణకు కిరోసిన్ క్రూడ్ అయిల్ తదితరవన్నీ చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి,స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

# దుకాణాలపై దూసుకుపోయిన లారీ

- పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్న స్థానికులు
- గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై ప్రమాదం

**శావల్యాపురం:** మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో లారీ అదుపు తప్పి దుకాణాలపై దూసుకుపోయిన సంఘటనలో ఆస్తినష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు మేరకు రాజమండ్రి నుంచి బెంగుళూరుకు ఎరువుల లోడుతో బయలు దేరిన లారీ మార్గమధ్యంలో శావల్యాపురం ప్రధాన కూడలి మార్గానికి రాగానే వినుకొండ నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న లారీను ఢీకొట్టింది. దీంతో ఎరువుల లోడు లారీ డ్రైవరు సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు వెంబడి ఉన్న పిన్నెల్లి కోటేశ్వరరావు, హరిబాబు, సముద్రపు శ్రీనివాసరావు, భవరిశెట్టి కోటేశ్వరరావు, జవ్వాజీ అంజయ్య, జక్కా శ్రీనివాసరావు దుకాణాలన్నీ ముందుభాగం పూర్తిస్థాయిలో ధ్వంసం అయాయి. నిత్యం రద్దీగా ఉండే ఏరియాలో కావటం మరో వైపు ఆటో స్టాండ్ కావటం చేత ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈప్రమాదంలో హోటల్ భవరిశెట్టి కోటేశ్వరరావు దుకాణంలో సలసల కాలుతున్న వంట నూనె గ్యాస్ సిలిండరు కొంతమొర నగదు, సెల్‌ఫోను తదితర సామాగ్రి అంతా చెల్లాచెదురుగా అయాయి. గ్యాస్ సిలిండరు లారీ కింద బాగానికి వెళ్లటంతో పోలీసు లు అప్రమత్తం అయి ఏరియాలో ప్రజలను గుంపులు ఉండకుండా జాగ్రత్త చర్యలు చేపట్టి వినుకొండ అగ్నిమాపక అధికారి బీర్నేడి నాగేశ్వరరావు తన సిబ్బంది పైరు ఇంజినుతో సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బుస్సా ఆదినారాయణకు చెందిన ఆటో ముందు భాగం కొంతమొర దెబ్బతింది. జక్కా సాంబశివరావుకు గాయాలయ్యాయి. వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు, రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, ఎస్సైలు లేళ్ల లోకేశ్వరరావు, యంవి కృష్ణారావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి లారీలో ఇరుక్కుపోయిన లారీ డ్రైవరు జాకీర్ హుస్సేన్‌ను స్థానికుల ద్వారా లారీ క్యాబిన్ నుంచి బయటకు తీసి 108 అత్యవసర వాహనంలో స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ఏరియా కావటం చేత పెను ప్రమాదం తప్పిందని ప్రజలందరూ ఊపిరి పిల్చుకున్నారు. క్రేన్ సహాయంతో దుకాణాల మధ్యలో ఇరుక్కుపోయిన లారీని పోలీసులు బయటకు తీసే సమయంలో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లికుండా చర్యలు చేపట్టారు.



ప్రమాదానికి కారణమైన లారి

### నరసరావుపేటలో తిరంగా ర్యాలీ



**నరసరావుపేట:** ఉగ్రదేశం పాకిస్తాన్ లో ఉన్న ఉగ్ర స్థావరాలను మట్టు పెట్టి శత్రుదేశం గుండెలపై గుద్ది ప్రపంచానికి భారత దేశ శక్తిని చూపిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేయడంలో భారత సైనికుల ధైర్య సాహసాలను స్మరించుకుంటూ తిరంగా యాత్ర నిర్వహించారు వీరోచిత పోరాటం చేసిన భారత సైనికులకు మద్దతుగా మేమున్నామంటూ నినాదంతో నరసరావుపేట పట్టణంలో కళాశాల వద్ద నుంచి మల్లమ్మ సెంటర్ వరకు చేపట్టిన తిరంగా ర్యాలీకి నరసరావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని ప్రారంభించారు 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు సైనికులకు ధన్యవాదాలు తెలియజేసారు భరత మాత కీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గం ప్రజలు టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు ప్రజాసంఘాల నేతలు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు

### దోమల వ్యాప్తిని నియంత్రించాలి

**చిలకలూరిపేట:** ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించాలని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కె.హేమంతకుమార్, డాక్టర్ సాయి కిరణ్ చెప్పారు. జాతీయ డెంగీడే ను పురస్కరించుకొని పట్టణంలోని రజకకాలనీ, భావనరుషినగర్, సుగాలీకాలనీల లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వద్ద డెంగీపై శుక్ర వారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్‌కూలర్లు, తాగి పడవేసిన కొబ్బరిబొండాలు, బయట పడవేసిన నీటి తొట్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి సమీపంలోని మురుగుకాల్వల్లో వారానికి ఒకసారి కిరోసిన్, లేక ఇంజిన్‌అయిల్ జల్లాలని సూచించారు. నీటి తొట్లను కనీసం వారానికి ఒక సారి శుభ్రపరిచి ఎండ ఆరబెట్టాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్‌సీహెచ్ నారాయణ, సూపర్‌వైజర్లు ఎస్వీ చలమారెడ్డి, ఎన్. శివయ్య, ఆరోగ్య కార్యకర్తలు బి.కోటేశ్వరరావు, షేక్ జిలాని, పీర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్ పై దాడి

**కొల్లిపర:** ఆటో డ్రైవర్ పై దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చివలూరు గ్రామం శివారులో సంఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులకు తెలిపిన వివరాలు ప్రకారం దావులూరు గ్రామానికి చెందిన గరిక నాగరాజు అనే అతను తన సొంత ఆటోలో ప్యాసింజర్లను ఎక్కించుకొని దావులూరు నుంచి తెనాలికి పోతుండగా కమతావారిపాలెం చెందిన గరిక గోపి అనే అతను ఇంకో ఆరుగురిని తీసుకొని వచ్చి చివలూరు గ్రామం శివారులో ఆటోను ఆపి తనను కొట్టి తిట్టినట్లు ఫిర్యాదుదారుడు నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. కోటేశ్వరరావు తెలిపారు.